# ‘తెల్లం’ గెలుపును సీఎంకు కానుకగా ఇద్దాం

- కేసీఆర్‌ను కూడా మూడోసారి ముఖ్యమంత్రిగా దీవించాలి
- భద్రాచలం, దుమ్ముగూడెం పర్యటనలో ఎమ్మెల్సీ తాతా మధు


వాకర్స్‌తో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం, ఎమ్మెల్సీ మధు

భద్రాచలం/ దుమ్ముగూడెం, అక్టోబర్ 3: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే డాక్టర్ తెల్లం వెంకట్రావు గెలుపుతోనే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ, భద్రాచలం నియోజకవర్గన్ ఇన్‌చార్జి తాతా మధు స్పష్టం చేశారు. ఈ నియోజకవర్గంలో తెల్లం వెంకట్రావును గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. కేసీఆర్‌ను కూడా మూడోసారి గెలిపించి ముఖ్యమంత్రిగా దీవించాలని కోరారు. దుమ్ముగూడెం మండలం సీతారాంపురం గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణ నివాసంలో బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ అభ్యర్థి తెల్లం వెంకట్రావుతో కలిసి మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు గెలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు రాముడు, జానీపాషా, కామేశ్, వెంకటయ్య, భీమరాజు, చందు, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, లక్ష్మణ్, జయసింహ, వెంకట్, గంగరాజు, వెంకటరమణ (బుజ్జి), నర్సింహారావు, సీతారామారావు, సిల్వకుమార్, కిరణ్, పాయం వెంకటేశ్, బొలిశెట్టి రంగారావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

### భద్రాచలంలో వాకర్స్‌తో మాటామంతీ

బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి తెల్లం వెంకట్రావు గెలుపును కాంక్షిస్తూ ఎమ్మెల్సీ తాతా మధు మంగళవారం భద్రాచలం పర్యటించారు. మంగళవారం ఉదయం ఆయన తెల్లం వెంకట్రావు, బీఆర్ఎస్ భద్రాచలం మండల అధ్యక్షుడు అరికెల్ల తిరుపతిరావుతో కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో వాకర్స్‌ను కలిసి వారితో ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ నిధులతో వాకర్స్‌కు ట్రాక్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పట్టణ ప్రముఖులు యోగి సూర్యనారాయణ, ఆలీంఖాన్, డాక్టర్ పవన్‌కుమార్, రంగారెడ్డి తదితరుల ఇళ్లకు వెళ్లి వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. నాయకులు దారపునేని రాంబాబు, చావా లక్ష్మీనారాయణ, కటుకూరి హరిబాబు, రూపా కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

# ‘దళితబంధు’ను తెచ్చింది కేసీఆరే.. యూనిట్లు ఇచ్చేది కేసీఆరే..

- కాంగ్రెసోళ్లు అధికారంలోకి వచ్చేది లేదు.. ప్రజలకు ఇచ్చేది లేదు..
- గృహలక్ష్మి మంజూరు పత్రాల పంపిణీలో జడ్పీ చైర్మన్ కమల్‌రాజు


లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న చైర్మన్లు

మధిర/ బోనకల్లు, అక్టోబర్ 3: రాష్ట్రంలో దళితబంధు పథకాన్ని తెచ్చింది సీఎం సీఆరేనని, యూనిట్లు అందించి ఫలాలు పంచిందీ సీఎం కేసీఆరేనని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు స్పష్టం చేశారు. మాయమాటలు చెప్పే కాంగ్రెసొళ్లు అధికారంలోకి వచ్చేది లేదని, ప్రజలకు ఇచ్చేది లేదని విమర్శించారు. అభివృద్ధి చేస్తూ సంక్షేమ పథకాలను అందిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. మధిర, బోనకల్లు మండలాల్లో మంగళవారం పర్యటించిన ఆయన.. టీఎస్ సీడ్స్ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావుతో కలిసి గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. బోనకల్లులోని సాయిబాబా కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. దళితుల అభ్యున్నతి కోసం దేశంలోనే ఎక్కడా అమలు కాని పథకంగా దళితబంధును రూపొందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని స్పష్టం చేశారు. అనంతరం కల్యాణలక్ష్మి చెక్కులను కూడా పంపిణీ చేశారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, అధికారులు బంధం శ్రీనివాసరావు, కంకనాల సౌభాగ్యం, గుగులోతు రమేశ్, వేమూరి ప్రసాద్, కంచర్ల బాబు, బయ్యావరపు అశోక్, పున్నం చందర్, చావా వెంకటేశ్వరరావు, కొమ్మినేని ఉపేందర్, తొండపు వేణు, నన్నక లక్ష్మి, ఆళ్ల పుల్లమ్మ, జెర్రిపోతుల రవీందర్, మర్రి తిరుపతిరావు, రాధ, దేవమణి, జమాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### మాయమాటలు నమ్మొద్దు..

కాంగ్రెస్ నేతలు చెప్పే మాయమాటలు నమ్మొద్దని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు సూచించారు. మధిర మండలంలో మంగళవారం పర్యటించిన ఆయన.. టీఎస్ సీడ్స్ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావుతో కలిసి మధిరలోని రెడ్డి కళ్యాణ మండపంలో గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. అర్హులందరూ ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని అన్నారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, అధికారులు బంధం శ్రీనివాసరావు, గుర్రం రామారావు, మొండితోక లత, మెండెం లలిత, శీలం విద్యాలత, మల్లాది వాసు, చావా వేణు, రమాదేవి, వెంకటేశ్వర్లు, సిలార్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే గెలుపు..

### ఇళ్ల స్థలం పొందిన వారంతా బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా ఉండాలి

### స్థలాల పంపిణీలో ఎమ్మెల్యే వనమా


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ కొత్తగూడెం అర్బన్/ రామవరం, అక్టోబర్ 3:తెలంగాణలో వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌దే గెలుపని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం అంటే ఏంటో తెలంగాణను చూస్తే తెలుస్తోందని గుర్తుచేశారు. భూమి, ఇళ్లు కోల్పోయిన ప్రతి నిర్వాసితుడికీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అందులో భాగంగానే ప్రతి అర్హుడికీ వంద గజాల చొప్పున ఇంటి స్థలాన్ని ఇస్తున్నామని అన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ 5వ వార్డులోని గంగాబిషన్‌బస్తీలో మంగళవారం ఏర్పాటు చేసి కార్యక్రమంలో లబ్ధిదారులకు ఆయన ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి మాట్లాడారు. సింగరేణి స్థలాల్లో అక్రమంగా స్థిర నివాసం ఏర్పరచుకొని దశాబ్దాలుగా ఉంటున్న మాయబజార్, ఎస్ఆర్‌టీ కాలనీ, వనమా నగర్ రైల్వే నిర్వాసితుల విషయాన్ని తాను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన మానవతా దృక్పథంతో ఆలోచించి ఈ ఇళ్ల స్థలాల కేటాయింపునకు ప్రత్యేకంగా జీవోను జారీ చేశారని గుర్తుచేశారు. సుమారు 400 మందికి ఇళ్ల స్థలాలను అందిస్తున్నామని, సర్వేకు వచ్చినప్పుడు అందుబాటులో లేకుండా, ఇతరత్రా కారణాల వల్ల అందుబాటులో లేని అర్హులైన 60 మందికి మరొకొన్ని రోజుల్లో ఇళ్ల పట్టాలు ఇస్తామని అన్నారు. ఇళ్ల స్థలాలు పొందినవారంతా బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, సింగరేణి అధికారులు కాపు సీతాలక్ష్మి, కంచర్ల చంద్రశేఖర్‌రావు, శాలెం రాజు, వేల్పుల దామోదర్, బాదావత్ శాంతి, గుమ్మడి సాగర్, ఇల్లా పరమేశ్, ఆర్తీ మక్కడ్, భూక్యా రాంబాబు, శిరీష, దొడ్డా పుల్లయ్య, జీ.రఘు, కౌడగాని పరమేశ్, అంబుల వేణు, బండి నర్సింహారావు, మాచర్ల రాజకుమారి, అనిల్, దూడల బుచ్చయ్య, నిమ్మల సాగర్, ఎండీ రజాక్, నిమ్మల రాజేశ్వరరావు, జేవీఎస్ చౌదరి, కాపు కృష్ణ, గూడెల్లి యాకయ్య, తొగరు రాజశేఖర్, సంకుభాపన అనుదీప్, రాసపల్లి రాజేంద్రప్రసాద్, కాసుల వెంకట్, భీమా శ్రీధర్, కంభంపాటి దుర్గాప్రసాద్, ఎంఏ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

# మన్యంలో ప్రగతి

- పినపాక నియోజకవర్గంలో దినదినాభివృద్ధి
- రూ.300 కోట్లకు పైగా ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు
- ఏడు మండలాల్లోనూ మౌలిక సదుపాయాలు
- గిరిజనులకు వరంగా ఆదివాసీ భవన్, డిజిటల్ లైబ్రరీ
- పూర్తికావొచ్చిన 30 కొత్త పంచాయతీ భవనాలు
- ప్రజలకు దగ్గరైన పాలన.. చేరువైన వైద్యం
- ఏజెన్సీపై సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రేగా ప్రత్యేక దృష్టి
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరి‘జనం’


గుండాల మండలంలోని కాచనపల్లి పంచాయతీ భవనం

సారపాక, అక్టోబర్ 3 : గిరిజనుల జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు కేటాయించి వారిని అభివృద్ధి పర్చడానికి తెలంగాణ ప్రభుత్వం 2017లో ఎస్టీ ప్రత్యేక ప్రగతినిధి చట్టం బిల్లును తీసుకొచ్చింది. అందులో భాగంగా ప్రతి ఏడాది గిరిజనుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తోంది. గిరిజన తండాలు, గూడేలను నూతన పంచాయతీలుగా మారుస్తూ 2018, మార్చి 28న ప్రభుత్వం ప్రకటించి రాష్ట్రవ్యాప్తంగా రూ.1,177 కొత్త పంచాయతీలను ఏర్పాటు చేసింది. ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నది. ఈ నిర్ణయం దేశ చరిత్రలోనే తెలంగాణలో ప్రథమంగా నిలిచింది. ఏజెన్సీ నియోజకవర్గమైన పినపాక అభివృద్ధిలో పరుగులు పెడుతున్నది. సాధారణ నిధులే కాకుండా ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పెద్దఎత్తున విడుదల కావడంతో నియోజకవర్గంలోని ఏడు మండలాలు మౌలిక సదుపాయాల కల్పనలో ముందున్నాయి. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రత్యేక దృష్టి సారించి పెద్దఎత్తున నిధులు తీసుకొచ్చి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

### మణుగూరుకు మణిహారం గిరిజన భవన్, డిజిటల్ లైబ్రరీ

ఆదివాసీలు ఎక్కువగా నివసించే నియోజకవర్గ కేంద్రమైన మణుగూరులో ఆదివాసీల ఆత్మగౌరవాన్ని నిలిపేలా ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్‌లో ఆదివాసీ బంజారా భవన్‌ను ఏర్పాటు చేశారు. అదే స్ఫూర్తితో నియోజకవర్గ కేంద్రాల్లో సైతం ఈ భవనాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో మణుగూరులో రూ.1.10 కోట్లతో ఆదివాసీ గిరిజన భవన్‌ను నిర్మించారు. ఆదివాసీలు సమావేశాలు, వివాహాది శుభకార్యాలు జరుపుకోవడానికి ఈ భవనాన్ని వినియోగిస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని చారిత్రాత్మక నిర్ణయం తీసుకొని ఆదివాసీల ఆరాధ్య దైవం కుమ్రంభీం జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తున్నారు. గిరిజనుల పట్ల ఎంతో ప్రేమ చూపుతున్న సీఎం కేసీఆర్ వారికి బాసటగా ఉంటూ ఆత్మగౌరవ భవనాలు నిర్మించారు. మణుగూరులో ఈ భవనం ఏర్పాటుతో ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు అన్నివిధాలుగా సౌకర్యవంతంగా మారింది. గిరిజనులకు గుర్తింపు తెచ్చిన సీఎం కేసీఆర్‌తోపాటు మన్యం ముద్దుబిడ్డ రేగా కాంతారావును సైతం ఈ ప్రాంత గిరిజనులు గుండెల్లో పెట్టుకొని చూసుకుంటున్నారు. యువత, విద్యార్థులు, నిరుద్యోగుల కోసం పట్టణంలో రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న అత్యాధునిక డిజిటల్ లైబ్రరీ త్వరలో అందుబాటులోకి రానున్నది. వేలాది మంది నిరుద్యోగులు, విద్యార్థులు, యువత వివిధ పోటీ పరీక్షలు, ఉద్యోగాలకు సిద్ధమయ్యేందుకు వీలుగా అన్ని హంగులతో లైబ్రరీ ఏర్పాటు చేస్తున్నారు. పోటీ పరీక్షల కోసం ప్రత్యేకంగా పుస్తకాలు, వివిధ వార్తాపత్రికలు అందుబాటులోకి వస్తే లైబ్రరీ వరంగా మారనున్నది.

### నియోజకవర్గ అభివృద్ధిపై రేగా ప్రత్యేక దృష్టి

పినపాక నియోజకవర్గంపై ఎమ్మెల్యే రేగా ప్రత్యేక దృష్టి సారించారు. మన్యాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ఎస్టీ సబ్‌ప్లాన్ కింద వందల కోట్ల నిధులు తెస్తున్నారు. మండల కేంద్రాలు, గ్రామాలు, తండాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. మణుగూరు రెసిడెన్షియల్ పాఠశాలలకు రూ.కోట్ల నిధులు తీసుకొచ్చి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. మణుగూరులో గిరిజనుల ఆత్మగౌరవ భవనం నిర్మించారు. ప్రధానంగా ఏజెన్సీ యువత, విద్యార్థులు, నిరుద్యోగుల కోసం నిర్మిస్తున్న డిజిటల్ లైబ్రరీ త్వరలో అందుబాటులోకి రానున్నది. మణుగూరు మున్సిపాలిటీలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడంతో విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి.

### రూ.8.10 కోట్లతో పంచాయతీ భవనాలు, పీహెచ్‌సీ సబ్‌సెంటర్లు

నియోజకవర్గంలో ఏర్పడిన కొత్త పంచాయతీల్లో 30 భవనాలు నిర్మిస్తున్నారు. ఒక్కో పంచాయతీ భవనానికి రూ.20 లక్షల చొప్పున రూ.6 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నారు. 14 సబ్‌సెంటర్లను కూడా మంజూరు చేసి ఒక్కో సబ్‌సెంటర్‌కు రూ.14 లక్షల నుంచి రూ.16 లక్షల చొప్పున రూ.2.10 కోట్లను ఖర్చు చేసి నిర్మాణాలు పూర్తి చేశారు. దీంతో గ్రామాల్లో ప్రజలకు పాలన దగ్గరైంది.. వైద్యం చెంతకు చేరింది. బూర్గంపహాడ్ మండలం తాళ్లగొమ్మూరులో పంచాయతీ భవనం పూర్తవగా.. గుండాల మండలం కాచనపల్లిలో పంచాయతీ కార్యాలయాన్ని ప్రభుత్వ విప్ రేగా ఇటీవల ప్రారంభించారు.

### విద్యాభివృద్ధికి ప్రత్యేక కృషి

గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నది. మణుగూరులో రూ.4.70 కోట్లతో రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను నిర్మించారు. దీంట్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.7.70 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో డార్మెటరీ హాల్, స్టాఫ్ క్వార్టర్లు, ప్రహరీ, వాటర్‌ట్యాంక్, టాయిలెట్స్ తదితర వాటిని నిర్మిస్తున్నారు. రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా ఈ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్య అందనున్నది.


మణుగూరులో నిర్మించిన గిరిజన ఆదివాసీ భవన్, కమ్యూనిటీ హాల్

### వందల కోట్లతో బీటీ, సీసీ రోడ్లు

నియోజకవర్గంలో రహదారులను మెరుగ్గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం వందల కోట్ల నిధులు మంజూరు చేస్తుండడంతో బీటీ, సీసీ రోడ్లు, వంతెనల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి. మణుగూరు, కరకగూడెం, అశ్వాపురం, పినపాక, బూర్గంపహాడ్ మండలాల్లో ఈ పనులు జోరుగా సాగుతుండగా.. తాజాగా ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో బీటీ రోడ్లకు ప్రభుత్వ విప్ రేగా శంకుస్థాపన చేశారు. గ్రామాల్లోని అంతర్గత రహదారులు సీసీ రోడ్లుగా మారుతున్నాయి. దీంతో ఏజెన్సీ ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

### నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా..



పినపాక నియోజకవర్గానికి ఎస్టీ సబ్‌ప్లాన్ కింద ఇప్పటివరకు ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.300 కోట్లకు పైగా నిధులు కేటాయించారు. ఈ నిధులను నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో అన్ని కులాల వారికి ఆత్మగౌరవ భవనాలు, ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ హాళ్లు, పీహెచ్‌సీ సబ్‌సెంటర్లు, నూతన పంచాయతీ భవనాలు, బీటీ, సీసీ రోడ్లు, వాగులపై వంతెనల కోసం కేటాయించాం. గ్రామాల్లో అంతర్గత రహదారులను నిర్మిస్తున్నాం. గత ప్రభుత్వాలు ఏజెన్సీని పట్టించుకోలేదు.. సీఎం కేసీఆర్ పాలనలో ఈ ప్రాంతం దినదినాభివృద్ధి చెందుతున్నది. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను కేటాయించిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

**– ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు**

### గిరిజనులకు వరం ఆదివాసీ భవన్



పూర్తి ఏజెన్సీ ప్రాంతమైన పినపాక నియోజకవర్గంలో గిరిజన ఆదివాసీ భవన్ ఏర్పాటు చేయడం ఈ ప్రాంత గిరిజనులకు వరం. గిరిజనుల వివాహాది శుభకార్యాలు, సమావేశాలతోపాటు ఇతర వర్గాలకు కూడా ఈ గిరిజన భవన్ ఉపయోగపడుతున్నది. మణుగూరులో ఈ భవన్ ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ ప్రాంత అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ప్రభుత్వ విప్ రేగా, సీఎం కేసీఆర్‌కు గిరిజనులు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారు.

**– పోలెబోయిన అనిల్‌కుమార్, ఆదివాసీ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు, మణుగూరు**

### పంచాయతీ ఏర్పాటుతో పాలన దగ్గరైంది



గతంలో పంచాయతీగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యాం. సీఎం కేసీఆర్ ప్రతి 500 మంది ప్రజలకు పంచాయతీని ఏర్పాటు చేయడంతో మా గ్రామం నూతన పంచాయతీగా ఏర్పాటైంది. రూ.20 లక్షలతో పంచాయతీ కొత్త భవనాన్ని నిర్మించుకున్నాం. త్వరలో ఆ భవనం నుంచి కార్యకలాపాలు సాగిస్తాం. నిధులు తెచ్చిన ప్రభుత్వ విప్ రేగాకు ప్రత్యేక ధన్యవాదాలు.

**– కొయ్యల పుల్లారావు, సర్పంచ్, తాళ్లగొమ్మూరు**

### నియోజకవర్గంలో 34 వేల మందికి ప్రయోజనం

### మంత్రి కేటీఆర్ ప్రకటనతో గంటన్నరలోనే జీవో జారీ

### ఫలించిన ఎమ్మెల్యే సండ్ర కృషి

### హర్ష వ్యక్తం చేసిన సంఘాల నాయకులు, దళితులు


వేంసూరు : సీఎం కేసీఆర్, ఎంపీ బండి పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్యే సండ్ర ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, మహిళలు

# దళితబంధువుల ఆనందం

కల్లూరు, అక్టోబర్ 3 : అన్ని వర్గాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్న సీఎం కేసీఆర్ దళితులు మరింతగా అభివృద్ధి చెందడానికి దళితబంధు పథకాన్ని తీసుకొచ్చారు. తొలిసారిగా దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టిన తెలంగాణ ప్రభుత్వం హుజూరాబాద్ నియోజకవర్గంలో ప్రతి దళిత కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున అందించింది. తర్వాత సత్తుపల్లి నియోజకవర్గంలోని పెనుబల్లి మండలం కారాయిగూడెం, సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామస్తులను పథకాన్ని వర్తింపజేసింది. కాగా.. రెండో విడతలో సత్తుపల్లి నియోజకవర్గంలోని ప్రతి దళిత కుటుంబానికి పథకాన్ని అందేలా చేస్తామని శనివారం సత్తుపల్లిలో జరిగిన సభలో రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించిన విషయం విదితమే. దీంతో దళిత సంఘాల నాయకులు, దళితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నియోజకవర్గవ్యాప్తంగా అందరికీ దళితబంధు అందించాలని సీఎం కేసీఆర్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే మంత్రి కేటీఆర్ సభలో ప్రకటించిన గంటలోపే సీఎం కేసీఆర్ జీవో జారీ చేసి దళితులపై ప్రేమను చాటుకున్నారు. నియోజకవర్గంలోని 34వేల దళిత కుటుంబాలకు ఒకేసారి పథకం అందించాలనే కృతనిశ్చయంతో ఎమ్మెల్యే సండ్ర చేసిన కృషి ఫలించింది. రాజకీయ ప్రమేయం.. మధ్యవర్తిత్వం లేకుండా పేదరికమే గీటురాటుగా నేరుగా నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడమే ఈ పథకం లక్ష్యం. దళితబంధు పథకం లబ్ధిదారులు తమకు నచ్చిన యూనిట్లను ఏర్పాటు చేసుకొని యజమానిలా దర్జాగా బతకాలన్నదే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయం.

### దళిత కుటుంబాల్లో వెలుగులు..

నియోజకవర్గంలోని ప్రతి దళిత కుటుంబానికి ఎలాంటి బ్యాంకు లింకేజీ రుణం లేకుండా 100 శాతం సబ్సిడీతో ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున సాయం అందించి ఆర్థికంగా అభివృద్ధి చేయాలని చూడడంతో వారి కుటుంబాల్లో వెలుగులు నిండినట్లైంది. నియోజకవర్గంలోని తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాల్లోని 34 వేల కుటుంబాలకు ఈ పథకాన్ని అందించేందుకు ప్రభుత్వం జీవో జారీ చేయడంతో దళిత సంఘాల నాయకులు, దళితులు పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గవ్యాప్తంగా దళిత సంఘాల నాయకులు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చిత్రపటాలకు పూలు, క్షీరాభిషేకాలు చేస్తూ కృతజ్ఞతను చాటుకుంటున్నారు.

### నా కల సాకారమైంది..



నియోజకవర్గంలోని ప్రతి దళిత కుటుంబానికి ఈ పథకం అమలు చేసేందుకు మంత్రి కేటీఆర్ ఇచ్చిన మాట ప్రకారం సీఎం కేసీఆర్ జీవో సైతం జారీ చేశారు. త్వరలోనే అర్హులందరికీ దళితబంధు పథకం అమలుకు శ్రీకారం చుడతాం. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునే లబ్ధిదారులు సరైన యూనిట్లను ఎంచుకుని ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. నా కల సాకారమైంది. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు ధన్యవాదాలు.

**– సండ్ర వెంకటవీరయ్య, ఎమ్మెల్యే, సత్తుపల్లి**

### దళిత కుటుంబాల్లో వెలుగులు



సీఎం కేసీఆర్ దళితుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన దళితబంధు దళిత కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నది. మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చిన గంటన్నర వ్యవధిలోనే సీఎం కేసీఆర్ అనారోగ్యంతో ఉన్నా సత్తుపల్లి నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేస్తూ ఇచ్చిన జీవోతో దళితుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కృషితో దళితులకు దళితబంధు వర్తించడం ఆనందదాయకం.

**– బీరవల్లి రఘు, దళిత నాయకుడు, కల్లూరు**

### దళితులకు దేవుడు కేసీఆర్



స్వయం ఉపాధితో దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు దళితబంధు పథకం బ్రహ్మాస్త్రం. సత్తుపల్లి నియోజకవర్గంలోని ప్రతి దళిత కుటుంబం దళితబంధు వర్తింపుతో కేసీఆర్‌ను దేవుడిలా చూస్తున్నారు. ఈ ప్రాంత దళితుల అభివృద్ధికి పాటుపడుతున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను దళితులు ఆరాధ్యునిగా చూస్తున్నారు.

**– నామా వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ నాయకుడు, చిన్నకోరుకొండి**

### పండుగ వాతావరణం



నియోజకవర్గవ్యాప్తంగా దళిత కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొన్నది. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే సండ్ర చిత్రపటాలకు దళితులు, దళిత నాయకులు పాలు, పూలాభిషేకాలు చేస్తూ తమ అభిమానం చాటుకుంటున్నారు. గ్రామాలకు వస్తున్న ఎమ్మెల్యే సండ్రకు దళితులందరూ వినూత్న రీతిలో దారిపొడవునా టెంకాయలు కొడుతూ దేవుడిలా కొలుస్తున్నారు.

**– పప్పుల రత్నాకర్, ఎస్సీ సెల్ నాయకుడు, పేరువంచ**

# సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే సండ్ర చిత్రపటాలకు పూలాభిషేకం


సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే సండ్ర చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కౌన్సిలర్లు

సత్తుపల్లి టౌన్, అక్టోబర్ 3 : నియోజకవర్గాన్ని దళిత పైలెట్ ప్రాజెక్టు కింద ప్రకటించినందుకు సీఎం కేసీఆర్, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు కృతజ్ఞతలు తెలుపుతూ వారి చిత్రపటాలకు సత్తుపల్లి పట్టణంలో మంగళవారం పూలాభిషేకం చేశారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు కౌన్సిలర్ మేకల భవాని, నర్సింహారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న అర్హులందరికీ దళితబంధు అందజేయాలని కేటీఆర్ ప్రకటించిన సందర్భంగా సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యల చిత్రపటానికి పూలాభిషేకం చేశారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పట్టణంలోని దళితులందరి తరపున సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అద్దంకి అనిల్, గుండ్ర రాఘవేంద్రరావు, సూరిబాబు, డీసీసీబీ డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రఫీ, కార్యదర్శి అంకమరాజు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

### దళితుల ఆరాధ్యదైవం సీఎం కేసీఆర్

దళితవాడల్లో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే సండ్ర ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం


మర్లపాడులో క్షీరాభిషేకం చేస్తున్న దళితకాలనీ వాసులు

వేంసూరు, అక్టోబర్ 3 : దళితుల ఆరాధ్యదైవం సీఎం కేసీఆర్ అని ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు అమలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం గ్రామాల్లోని దళిత కాలనీల్లో సీఎం కేసీఆర్, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఫ్లెక్సీలకు పూలజల్లుతోపాటు క్షీరాభిషేకం చేశారు. ఇందులో భాగంగా పల్లెవాడ, వేంసూరు, మర్లపాడు, కందుకూరు, వెంకటాపురం, జయలక్ష్మీపురం గ్రామాల్లోని దళిత కాలనీలో సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు దొడ్డా చెన్నకేశవరెడ్డి, దొడ్డా వెంకటకృష్ణారెడ్డి, మారోజు సురేశ్, గాదె శ్రీనివాసరావు, గుండాల వెంకటేశ్వరరావు, ఎలమంచిలి వెంకటేశ్వరరావు, నాయుడు, మందపాటి వేణుగోపాల్‌రెడ్డి, ఘంట సామిరెడ్డి, దుబా శ్రీనివాసరెడ్డి, బాబురెడ్డి, మందపాటి వెంకటకృష్ణారెడ్డి, కంటే వెంకటేశ్వరరావు, బుల్లిబాబు, మహిళలు పాల్గొన్నారు.